ప్రజల పత్రికలను బతికించుకోవాలి

- కార్పొరేట్ల ప్రయోజనాలకే ఆధునిక మీడియా ప్రాధాన్యం
- డిజిటల్ రంగంలో మరింత మెరుగవ్వాలి
- భావజాల వ్యాప్తిలో మీడియా, సోషల్ మీడియా, పుస్తకాలదే కీలకపాత్ర
- బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆధునిక మీడియాలో ఎక్కువ పత్రికలు కార్పొరేట్ల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తుండటం పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ప్రజల కోసం పనిచేస్తున్న నవతెలంగాణ లాంటి పత్రికలను బతికించుకోవాల్సిన బాధ్యత రిపోర్టర్లు, సిబ్బందిపైనే ఉందని చెప్పారు. పెద్దపెద్ద పత్రికలకు వనరులు సమకూర్చేవారు వేరేగా ఉంటారని, అవసరాల కోసం, ఆర్థిక ప్రయోజనాల కోసం అవి నడుస్తాయని వివరించారు. వాటి పాత్రకు విభిన్నంగా నిబద్ధతతో పనిచేస్తున్న నవతెలంగాణ సిబ్బందికి అభినందనలు తెలిపారు. మీడియా, నవ తెలంగాణ వర్క్ షాపులో ఆయన మాట్లాడుతూ... సోషల్ మీడియా, పుస్తకాల ద్వారా వామపక్ష భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత, జరుగుతున్న కృషి గురించి వివరించారు. ఆయా రాష్ట్రాల్లోని పలు పత్రికలతో సమన్వయం చేసుకోవడం, అన్ని పత్రికలకూ నిర్దిష్టమైన సమాచారం అందేలా కేరళలోని దేశాభిమాని పత్రిక నేతృత్వంలో ఒక న్యూస్ పోర్టల్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలను చైతన్యపర్చే పుస్తకాలు మరింత రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. పలు పుస్తక ప్రచురణ సంస్థలు, విక్రయాల సంస్థలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ఈ నెల 30న చెన్నైలో సమావేశం నిర్వహించబోతున్నట్టు తెలిపారు. సోషల్‌మీడియా ప్రాధాన్యత రోజురోజుకీ పెరుగుతోందన్నారు. ఆ రంగంలో మరింత రాణించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రజలను చైతన్య పర్చడంలోనూ, భావజాల విస్తరణలో నూ మీడియా, సోషల్ మీడియా, పుస్తకాలు చాలా కీలకమని సిపిఎం భావిస్తోందన్నారు. ఆధునిక మీడియాలో ప్రజల సమస్యల కన్నా, అభివృద్ధి కన్నా కార్పొరేట్ల ప్రయోజనాలకు, క్రోనీ క్యాప్టలిజానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న తీరును ఎండగట్టారు. అంబానీ, ట్రంప్ లాంటి వ్యక్తులకు అనుకూలంగా పత్రికలు వార్తలు రాయటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీకి లబ్ది చేకూరేలా పలు మీడియా సంస్థలు విద్యుత్‌పై కథనాలు ప్రచురితం, ప్రసారం చేస్తున్న తీరును వివరించారు. రంగులు ఆర్భాటాలు కాదు ప్రజలకు అవసరమైన కంటెంట్‌ను ప్రజెంట్ చేయాల్సిన బాధ్యత నవతెలంగాణ లాంటి పత్రికలపై ఉందని నొక్కిచెప్పారు. పత్రికను మరింత ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేస్తున్న పలువురు రిపోర్టర్లకు రీజియన్లవారీగా బహుమతులను అందజేశారు. నవతెలంగాణ దినపత్రిక పదో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన వెబ్‌టీమ్‌కు, రన్నరప్‌గా నిలిచిన బ్యూరో టీమ్‌కు షీల్డ్స్, బహుమతులను రాఘవులు అందజేశారు.



మాట్లాడుతున్న బివి రాఘవులు

రూ.11 వేల కోట్లతో హ్యామ్ రోడ్లు

- 2026లో పనులకు శ్రీకారం
- మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రూ.11 వేల కోట్లతో హ్యామ్ రోడ్లు నిర్మిస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. 32 ప్యాకేజీల్లో 400 రోడ్లను నిర్మిస్తామని ప్రకటించారు. టెండర్లల్లో చిన్న కాంట్రాక్టర్లు సైతం పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష చేశారు హ్యామ్ రోడ్ల బిల్లుల చెల్లింపుల విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. వచ్చే రెండేళ్లలో దేశానికే రోల్ మోడల్‌లా రాష్ట్రంలో రోడ్లను నిర్మిస్తామన్నారు. అద్దం లాంటి రోడ్లకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ నిలవబోతోందని అభిప్రాయపడ్డారు. రోడ్ల నిర్మాణం జరిగేటప్పుడు వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ లాంటివి చేయొద్దని మంత్రి కోరారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదం బారిన పడి కన్న తల్లిదండ్రులకు శోకాన్ని మిగల్చవద్దని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.100 కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషిచేశానని వివరించారు. మిగతా రూ.50 కోట్ల పెండింగ్ బిల్లులు కూడా త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో 58 మంది

- నియోజకవర్గ చరిత్రలో ఇంత మంది పోటీ ఇదే తొలిసారి
- మొత్తం 4,01,365 మంది ఓటర్లు
- తుది ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా.. వాటిలో 81 ఆమోదం పొందాయి. అనంతరం 23 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉప సంహరించుకోవడంతో చివరికి 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులూ ఉన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇంత మంది పోటీ చేయడం ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014లో 21 మంది, 2018లో 18 మంది, 2023లో 19 మంది పోటీ పడ్డారు.

తుది ఓటర్ల జాబితా విడుదల

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి. కర్ణన్ తుది ఓటర్ల జాబితాను విడుదల చేశారు. మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత 2,383 మంది కొత్త ఓటర్లు చేరారని వివరించారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.2.84 కోట్లు, రూ.3.69 లక్షల విలువ చేసే 512 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 139 లోకేషన్లలో 407 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

గత ఎన్నికలతో పోల్చితే నియోజకవర్గంలో ఈసారి 1.61 శాతం ఓటర్లు పెరిగారని చెప్పారు. అదేవిధంగా, 80 ఏండ్లకు పైబడిన ఓటర్లు 6,052 మంది (పురుషులు 3,280, మహిళలు 2,772)గా ఉన్నారు. 18-19 ఏండ్ల వయస్సు ఓటర్లు 6,106 మందిగా నమోదయ్యారు. మొత్తం వికలాంగ ఓటర్లు 1,891 మంది ఉన్నారు. వీరిలో చూపులేని వారు 519 మంది, శారీరక వైకల్యం ఉన్న వారు 667 మంది, వినికిడి లోపం ఉన్న వారు 311 మంది, ఇతర వైకల్యాలు కలిగిన వారు 722 మంది ఉన్నారు. ఎన్నారై ఓటర్లు 95 మంది ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

విజ్ఞాన వినియోగంతో ఉజ్వల భవిష్యత్తు పొందాలి

- నూతన పరిశోధనలకు 'కావేరి' దేశంలోనే ఆదర్శం కావాలి
- పరిశోధనా ఫలాలు రైతులకు చేరువ చేయాలి : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- సిద్దిపేట జిల్లాలోని కావేరి యూనివర్సిటీలో ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ ప్రమాణాలతో కూడిన కావేరి విత్తన పరిశోధనా కేంద్రం జాతీయస్థాయిలో ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి శివారులోని కావేరి విత్తన పరిశోధనా కేంద్రం, వర్గల్ మండలం గౌరారంలోని కావేరి విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం గవర్నర్ పర్యటించారు. విశ్వవిద్యాలయం సాధించిన పురోగతి, క్షేత్రస్థాయి పరిశోధనలు, అధునాతన వసతులు, ఎంటమాలజీ, పాథాలజీ, బ్రీడింగ్, ఫిజియోలజీ ల్యాబ్స్ తదితరులను పరిశీలించారు. అలాగే, విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల డ్రోన్ టెక్నాలజీ, రోబో టెక్నాలజీ, 3 డి ప్రింటింగ్, ఎఆర్ అండ్ విఆర్ మోడల్స్, అగ్రికల్చరల్ ఇన్నోవేషన్స్‌ను తిలకించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి వాటి పరిశోధనా ఫలాలను రైతులకు చేరువ చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పరిశోధనా విద్యార్థులు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను పొంది మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. నూతన సాంకేతికతతో అద్భుత వంగడాలు, ఆహార సంపద సృష్టించి దేశ పునర్నిర్మాణంలో కావేరి విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు సమాజ మార్పుకు దిక్సూచిలా ఉండాలని, విజ్ఞానాన్ని వినియోగించి ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధితో నిరంతర ఆవిష్కరణలు జరగాలని, దైనందిన జీవితంలో డ్రోన్ టెక్నాలజీ ముఖ్య భూమిక పోషిస్తుందని అన్నారు. అంతేగాకుండా పర్యావరణానికి హాని జరగకుండా సహజ సిద్ధంగా లభించే సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరిగి ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులను సాధించాలని తెలిపారు. చాన్సలర్ జీవీ భాస్కర్ రావు, వైస్ చాన్సలర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. కావేరి యూనివర్సిటీ అద్భుత పరిశోధనలతో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నదని హామీ ఇచ్చారు. కావేరి సీడ్స్ కంపెనీతో సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు రాష్ట్ర వ్యవసాయ రంగానికి మనోబలం కలిగిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్, ఎసిపి నర్సింలు, ఆర్‌డిఒ చంద్రకళ, సిఐ మహేందర్ రెడ్డి, తహసీల్దార్లు సరిత, రఘువీరా రెడ్డి, కావేరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ హర్ష పొలసాని, అగ్రికల్చరల్ డీన్ ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ కొండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదంపై సిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్నూల్ జిల్లా బస్సు ప్రమాదంపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి సిఎస్ రామకృష్ణారావు, డిజిపి శివధర్‌రెడ్డితో శుక్రవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వెంటనే హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు జెన్‌కో సిఎండి హరీష్‌ను వెంటనే ప్రమాదం జరిగిన చోటుకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. గద్వాల కలెక్టర్, ఎస్‌పి అక్కడే అందుబాటులో ఉండాలనీ, బాధిత కుటుంబాలకు అండదండగా ఉండాలని సూచించారు. మరణించిన వారి గుర్తింపుతో పాటు క్షతగాత్రులకు అవసరమైన వైద్యసాయం అందించే చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : మంత్రి జూపల్లి

కర్నూలు జిల్లాలో జరిగిన ప్రయివేటు ట్రావెల్ బస్సు ప్రమాదంలో మరణించిన, గాయపడ్డ తెలంగాణ ప్రాంతానికి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ప్రమాద ఘటనా స్థలాన్ని జోగులాంబ గద్వాల జిల్లా అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు ప్రమాద ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు మరణించారని, పదిమంది గాయాలతో బయటపడ్డారని తెలిపారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మరణించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి సిఎం రేవంత్ రెడ్డి రూ. ఐదు లక్షలు, గాయపడ్డ వారికి రూ. రెండు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని చెప్పారు. ఈ ప్రమాదం బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ 2013లో పాలెం వద్ద జరిగిన ఘటనలో 48 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ప్రయివేటు బస్సుల యాజమాన్యాలు సుశిక్షితులైన డ్రైవర్లను నియమించుకునేలా, రవాణా శాఖ నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. మంత్రితోపాటు తెలంగాణ జెన్కో సిఎండి హరీష్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్, ఎస్‌పి శ్రీనివాసరావు, డిఎస్‌పి మొగిలయ్య. ఆర్డీవో అలివేలు, ఉండవెల్లి ఎమ్మార్వో ప్రభాకర్, తదితరులున్నారు.

హెల్ప్‌లైన్ నెంబర్లు

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న బస్సు ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో బాధిత కుటుంబాలకు సహాయం అందించేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. సహాయం కోసం 9912919545 (ఎం శ్రీరామచంద్ర, అసిస్టెంట్ సెక్రటరీ), 9440854433 (ఈ.చిట్టి బాబు, సెక్షన్ ఆఫీసర్) హెల్ప్ లైన్ నెంబర్లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రైతుల ఆమోదం తర్వాతే భూసేకరణ చేపట్టాలి

- హెచ్‌ఎండిఏ కమిషనర్‌తో సిపిఎం ప్రతినిధి బృందం చర్చలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతుల ఆమోదం తర్వాతే ఆర్‌ఆర్‌ఆర్‌కు సంబంధించిన భూసేకరణ చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో సిపిఎం ప్రతినిధి బృందం ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై చర్చలు జరిపింది. ఈ బృందంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, డిజి నరసింహారావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తదితరులు ఉన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ భూ సేకరణ అలైన్‌మెంట్ మార్చడం వల్ల రైతులు గందరగోళ పడుతున్నారని తెలిపారు. ఉత్తరం భాగంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం భూసేకరణ చేసిందని కమిషనర్ దృష్టికి తెచ్చామని పేర్కొన్నారు. కానీ ఇప్పటికీ స్థానిక రైతులతో అధికారులు చర్చించలేదని తెలిపారు. గ్రామసభలు జరిపి రైతులతో మాట్లాడలేదని వివరించారు. నష్టపరిహారం నిర్ణయించలేదని పేర్కొన్నారు. రైతుల ఆమోదం లేకుండానే భూమిని తీసుకోవడం పూర్తయ్యిందంటూ ప్రకటించడం సమంజసం కాదని వివరించారు. దక్షిణ ప్రాంతంలో ప్రస్తుతం ప్రకటించిన అలైన్‌మెంట్ మార్పులు, చేర్పులతో అస్పష్టంగా ఉందని తెలిపారు. అలైన్‌మెంట్‌లో ఏ మార్పులూ చేయలేదని కమిషనర్ చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కొంతమంది పెత్తందార్ల కోసం, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం అలైన్‌మెంట్లు మార్చుతూ పేద రైతుల భూములను లాక్కునే చర్యను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ అన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రైతుల తరపున ఆందోళనా పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు.

వారం రోజుల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల జనరల్ లిస్ట్

- టియుఎంహెచ్ఇయు నేతలతో డాక్టర్ చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2,322 నర్సింగ్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి సంబంధించి వారం రోజుల్లో జనరల్ లిస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని ప్రజాభవన్‌లో సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. నర్సింగ్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని టీయుఎంహెచ్ఇయూ నేతలు కోరారు. నర్సింగ్ ఆఫీసర్లకు సంబంధించి ప్రొవిజనల్ లిస్ట్ మాత్రమే విడుదల చేశారనీ, జనరల్ మెరిట్ లిస్ట్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన చిన్నారెడ్డి మెడికల్ నియామక మండలి కార్యదర్శితో మాట్లాడి వారం రోజుల్లో జనరల్ మెరిట్ లిస్ట్ విడుదలకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ల్యాబ్ టెక్నిషియన్ పోస్టుల ఫైనల్ సెలక్షన్ లిస్ట్ విడుదల చేయాలని నాయకులు కోరారు. దీనిపై కూడా బోర్డు కార్యదర్శితో మాట్లాడిన చిన్నారెడ్డి, ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే లిస్ట్ ప్రకటిస్తామని తెలిపారు. ఏఎన్ఎం, ఫార్మసిస్టుల మెరిట్ లిస్టుల విషయంలో ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని నియామకాలను భర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాల్, నర్సింగ్ ఆఫీసర్ల తరపున సుష్మా, రమేష్ రెడ్డి, చందు, మధు, ల్యాబ్ టెక్నీషియన్ల తరపున ఆదిత్య, సంగమేశ్వర్ , కోటేష్, సంజయ్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కవిత (ఏఎన్ఎం లీడర్) పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ గల్లంతు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందంటూ కెసిఆర్ కలలు కంటున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఎద్దేవా చేశారు. ఆ పార్టీ గెలువకపోగా, వంద శాతం గల్లంతు అవుతుందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు డిపాజిట్ వస్తుందో, రాదో చూసుకోవాలని హెచ్చరించారు. గులాబీ పార్టీని ఎందుకు గెలిపించాలో ఆ పార్టీ నేతలు ఒక్క కారణమైన చెప్పగలరా? అని సవాల్ విసిరారు. రాష్ట్రాన్ని బిఆర్ఎస్ నాశనం చేసిందనే కారణంగా ఓడించారని గుర్తు చేశారు. బిసిలనుద్దేశించి కెటిఆర్, కెసిఆర్ పిచ్చి మాటలు మాట్లాడుతుంటే, ఆ పార్టీలోని ఆ సామాజిక తరగతికి చెందిన నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు కెసిఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



కలిసి అద్భుతాలు ఆవిష్కరిద్దాం

- ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం
- ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అడ్వాన్స్డ్ టెక్నాలజీస్, గ్లోబల్ హెల్త్ ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, సస్టైనబుల్ ఇంజనీరింగ్, క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ తదితర రంగాల్లో వినూత్న ఆవిష్కరణల కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని మెల్‌బోర్న్‌లోని ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీ ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఇక్కడి ప్రముఖ విద్యా సంస్థలను భాగస్వామ్యం చేస్తూ జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్స్, ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌లు, కో-ఇన్నోవేషన్ ఇనిషియేటివ్స్‌ను చేపట్టాలని కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం మెల్బోర్న్‌లోని ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం ఉమ్మడి పరిశోధన, ఇన్నోవేషన్ బేస్డ్ కొలాబరేషన్, అకడమిక్ ఎక్స్ఛేంజ్ , స్టార్టప్‌ల భాగస్వామ్యం తదితర అంశాలపై యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌'గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ ఇన్నోవేషన్ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, టీ హబ్, టీ వర్క్స్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలకు ఈ భాగస్వామ్యం మరింత ఊతమిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. "గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్" మారేందుకు అవసరమైన ఎకో సిస్టం కలిగిన తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ వైస్-ప్రోవోస్ట్ ప్రొఫెసర్ మ్యాథ్యూ గిలెస్పీ వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి పరిశోధనలు, సంయుక్త ప్రాజెక్టులను చేపట్టేందుకు వీలుగా రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీన్ రీసెర్చ్ ప్రొఫెసర్ లే హై వూ, డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ క్రిస్టోఫర్ థామ్సన్ పాల్గొన్నారు.

ఉద్యానరంగంలో నూతన ఆవిష్కరణలపై దృష్టి

- ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యాన పంటలు, ఉత్పత్తులు రాష్ట్రంలోని ప్రతి ఇంటికి అందేలా 'ఇంటింటికి ఉద్యానం' అనే కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్టు కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో సంవత్సర పరిపాలన కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యాన రంగంలో మేలైన అభివృద్ధికి కృత్రిమ మేధను అన్వయించేందుకు కావలసిన ప్రత్యేకకార్యకరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఆధునిక హంగులతో పరిశోధన ఇంకుబేషన్ కేంద్రాలు, విద్యార్థుల కోసం అంకుర పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో నైపుణ్యం పెంచేందుకు 'జెఆర్‌ఎఫ్ కం కాంపిటీటివ్ సెల్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అనేక లాభాలు ఉన్న 'జీనోమ్ ఎడిటింగ్, టిష్యూకల్చర్‌పై పరిశోధనలకు ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. 'విద్యార్థులు పరిశోధనలో ఆవిష్కరణలకు ఆసక్తి చూపాలి. ఫలితాలు ఎప్పటికప్పుడు రైతులకు అందేలా పేరెన్నిక కలిగిన జనరల్లలో పరిశోధన పత్రాలు ప్రచురించాలి. విద్యార్థులే వర్సిటీ భవిష్యత్తుకు మూల స్తంభాలుగా ఎదగాలని' పిలుపునిచ్చారు. విద్యార్థి స్థాయిలోనే మరింత లోతైన పరిశోధనలు చేపట్టేందుకుగానూ దేశంలో పేరుపొందిన పరిశోధక సంస్థలతో కలిసి పని చేసేందుకు విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. పరిశోధన, బోధన, విస్తరణ రంగంలో సాధించిన విజయాలను వర్సిటీ డీన్ డాక్టర్ జె.చీనా నివేదించారు. ఈ సందర్భంగా సంవత్సరంలో వర్సిటీ సాధించిన విజయాలపై రూపొందించిన 'క్రానికల్ ఆఫ్ ప్రోగ్రెస్', ఆల్బమ్‌లను వైస్ చాన్సలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్ డాక్టర్ జె.చీనా, రిజిస్ట్రర్ డాక్టర్ ఎ.భగవాన్, డాక్టర్ ఎం.రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎన్.శ్రీనివాసన్, కన్సల్టెంట్ డాక్టర్ కె.వీరాంజనేయులు, డాక్టర్ వినోదిని, అసోసియేట్ డీన్లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సైదయ్య, డాక్టర్ అనిత కుమారి, పోతురాజు యాదయ్య, చెంచు రామయ్య, వీరన్న, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



వరంగల్ నిట్‌లో టెక్నోజియన్-2025 ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్‌లోని జాతీయ సాంకేతిక సంస్థ(నీట్)లో వార్షిక సాంకేతిక మహోత్సవం 'టెక్నోజియన్-2025' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమంలో అధికారిక టెక్నోజియాన్- 2025 వీడియోను ప్రదర్శించారు. దీనిలో గత ఎడిషన్‌ల ముఖ్య ఘట్టాలు, ఈ ఏడాది ప్రధాన కార్యక్రమాల అవలోకనాన్ని వివరించారు. ఈ వేడుకకు ఎన్‌ఐటి వరంగల్ పూర్వ విద్యార్థిని, బెంగళూరులోని భారతీయ విజ్ఞాన సంస్థ ప్రొఫెసర్ జి మాధవిలత, సాంకేతిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు వెంకన్న మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఎత్తయిన చెనాబ్ రైల్వే వంతెన గురించి వివరించారు. దృఢత్వం, సృజనాత్మకత, సంక్లిష్ట సమస్యల పరిష్కారంలో సమన్వయ ప్రాముఖ్యతను తెలిపారు. రూపకల్పన కచ్చితత్వం, స్థలస్థాయి నిర్ణయాలు, బృంద సమన్వయం ఈ మూడు అంశాల కలయికతోనే ఈ మహా ప్రాజెక్ట్ విజయవంతమైందని చెప్పారు. అలాగే, టెక్నోజియన్ ఉద్దేశ్యాన్ని వివరించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కె. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకుల కృషిని ప్రశంసించారు. 2001లో ప్రారంభమైన టెక్నోజియన్ ప్రస్తుతం దేశంలోని అగ్రగామి విద్యార్థి ఆధారిత సాంకేతిక ఉత్సవాల్లో ఒకటిగా ఎదిగిందని అన్నారు. ఈ ఏడాది దాదాపు 7000 మంది విద్యార్థులు వివిధ విద్యాసంస్థల నుంచి పాల్గొన్నారని తెలిపారు. ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ పి రాధాకృష్ణ, టెక్నోజియన్ బృందం చూపిన నిబద్ధత, ప్రొఫెషనలిజాన్ని అభినందించారు. ఎన్‌ఐటీ వరంగల్ డైరెక్టర్.. వర్చువల్‌గా పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. టెక్నోజియన్ ద్వారా సృజనాత్మకత, నాయకత్వం, నిజజీవిత ఇంజనీరింగ్ ప్రతిభను ప్రోత్సహిస్తున్నందుకు ప్రశంసలు తెలిపారు.

మరింత సౌకర్యవంతంగా పోలింగ్ స్టేషన్లు


- ఓటర్లకు కనీస సౌకర్యాల కల్పన.. సహాయ కేంద్రాలు
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సిఇఒ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా పోలింగ్ స్టేషన్లలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించబోతున్నామని, అక్కడే సహాయ కేంద్రాలు కూడా ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిసారిగా పోలింగ్ స్టేషన్ల బయట మొబైల్ ఫోన్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఓటర్లు తమ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి కౌంటర్లలో ఉంచి, ఓటు వేసిన తర్వాత తిరిగి స్వీకరించవచ్చని వివరించారు. వృద్ధులు, వికలాంగులతో పాటు ప్రతి ఒక్కరూ సులభంగా ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ తాగునీరు, టాయిలెట్లు, వేచి ఉండే స్థలాలు, లైటింగ్, ర్యాంపులు, స్పష్టమైన సైన్‌బోర్డులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఓటు రహస్యాన్ని కాపాడేందుకు ప్రామాణిక ఓటింగ్ కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఓటరు సమాచార పోస్టర్లలో పోలింగ్ వివరాలు, అభ్యర్థుల జాబితా, గుర్తింపు కార్డు అవసరాలు, ఓటింగ్ సూచనలు ప్రదర్శిస్తామని వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఓటరు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, బూత్ లెవల్ అధికారులు వాటిని పర్యవేక్షిస్తారని తెలిపారు. ఓటర్లు తమ పేరు, బూత్ నంబర్‌ను ఓటరు జాబితాలో కనుగొనేందుకు అవి సహాయపడతాయని పేర్కొన్నారు. తెలంగాణలోని పోలింగ్ స్టేషన్లను ఓటర్లకు మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు ఎన్నికల సంఘం చేస్తున్న ప్రయత్నాల్లో ఇవి భాగమని తెలిపారు. జూబ్లీ హిల్స్‌లోని ప్రతి ఓటరుకు సౌకర్యవంత, గౌరవప్రద ఓటింగ్ అనుభవాన్ని అందించడంపై తాము దృష్టి సారించామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో లోపాలు సహించం

- సరుకుల సరఫరాలో అలసత్వం వహిస్తే కాంట్రాక్టర్లపై చర్యలు
- చిన్నారుల హాజరు 90 శాతం లక్ష్యం
- మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి డాక్టర్ సీతక్క



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ కేంద్రాల్లో లోపాలుంటే సహించబోమని, సరుకుల సరఫరాలో అలసత్వం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) హెచ్చరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాల పురోగతిపై ఆ శాఖ రాష్ట్ర, జిల్లా అధికారులతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పాలు, గుడ్లు, పప్పు, మంచి నూనె, బాలామృతం, మురుకులు, బియ్యం వంటి వస్తువుల సరఫరాపై జిల్లాలవారీగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని జిల్లాల్లో సరఫరా 50 శాతానికి కూడా చేరకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులను ఆదేశించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు. టేక్ హోమ్ రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ విజయవంతంగా అమలవుతోందన్నారు. ప్రస్తుతం 90 శాతం లబ్దిదారులు ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంలో సరుకులు అందుకుంటుండగా దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని గుర్తుచేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలను ఉదయం తొమ్మిది గంటలలోపు తెరవకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నెలా కనీసం ఒక కొత్త చిన్నారి చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్లే స్కూళ్ల స్థాయిలోనే విద్యా నాణ్యత ఉండేలా తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని సూచించారు. ఈ నెలలో ఇప్పటి వరకు గర్భిణుల హాజరు 80 శాతం, బాలింతల హాజరు 85 శాతం ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల హాజరు శాతాన్ని 68 నుంచి 90 శాతానికి పెంచాలని నిర్దేశించారు. శక్తి సదనాలు, స్టే హోమ్స్, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లను అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి పర్యవేక్షించాలని ఈ సమీక్షలో శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'విక్టోరియా పార్లమెంట్'ను సందర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం 'విక్టోరియా పార్లమెంట్'ను సందర్శించారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ గవర్నమెంట్ విప్ 'లీ తార్లామిస్', పార్లమెంటరీ సెక్రటరీ 'షీనా వాట్' ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లెజిస్లేటివ్ ప్రొసీజర్స్, పార్లమెంటరీ గవర్నెన్స్, పబ్లిక్ అకౌంటబిలిటీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. శాసనాల తయారీలో పౌరుల భాగస్వామ్యం పెరిగినప్పుడే పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అమలవుతున్న ప్రోగ్రెసివ్ లెజిస్లేటివ్ ప్రాక్టీసెస్, గవర్నెన్స్ రిఫార్మ్స్, డిజిటల్ ఇనీషియేటివ్స్‌ను వారికి వివరించారు. ట్రాన్స్‌పరెంట్, టెక్నాలజీ - ఎనేబుల్డ్, సిటిజన్ - డ్రివెన్ గవర్నెన్స్ మోడల్స్ రూపకల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తుందని చెప్పారు. 'తెలంగాణ - విక్టోరియా' మధ్య ఇన్‌స్టిట్యూషనల్ కొలాబరేషన్‌ను పెంపొందించేందుకు చొరవ చూపాలని కోరారు. ప్రగతిశీల విధానాల ను అనుసరిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తున్న 'తెలంగాణ' లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని 'లీ తార్లామిస్', 'షీనా వాట్' తెలిపారు. 'తెలంగాణ-విక్టోరియా' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

యూనిఫైయాప్స్ రూ.440 కోట్ల నిధుల సమీకరణ

హైదరాబాద్ : యూనిఫై యాప్స్ 50 మిలియన్ డాలర్లు (రూ.440 కోట్లు) నిధులను సమీకరించినట్లు తెలిపింది. వెస్ట్ బ్రిడ్జ్ క్యాపిటల్ నేతృత్వంలో సిరీస్ బి రౌండ్‌లో ఈ మొత్తాన్ని పొందినట్లు ఆ సంస్థ నూతన కో సిఇఒ రాగి థామస్ వెల్లడించారు. ఈ కొత్త పెట్టుబడితో యూనిఫైయాప్స్ మొత్తం నిధులు 81 మిలియన్లకు చేరుతాయన్నారు.

దుందుభీ టు హైదరాబాద్ ఇసుక రవాణా

- రాత్రికాగానే గద్దల్లా వాలుతున్న ఇసుక మాఫియా
- దుందుభీ ఖాళీ.. నదిలో మొలుస్తున్న అడవిగడ్డి
- అనుమతులు లేకున్నా అక్రమంగా తవ్వకాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నదుల్లో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.. ఇసుక మాఫియా రాత్రి వేళల్లో పాగా వేసి తోడేస్తోంది. రాష్ట్ర రాజధానికి రవాణా చేస్తున్నారు.. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో దుందుభీ నది ఖాళీ అవుతోంది.. దుందుభీ నుంచి హైదరాబాద్ వయా కడ్తాల్ మీదుగా రాత్రంతా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇసుక ఖాళీ కావడంతో భూగర్భజలాలు తగ్గిపోయి సాగు భూములకు నీరు అందడం కష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో దుందుభీ నదిలో ఇసుక మేటలు అధికంగా ఉన్నాయి. దాసర్లపల్లి, ఉప్పునుంతల, రఘుపతిపేట, పొల్మూరు పరిధిలో ఉండే ఇసుక మేటలపై అక్రమార్కుల దృష్టి పడింది. ప్రధానంగా ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి గ్రామ సమీపంలో ఉండే ఇసుక తరలించడానికి కొందరు రోడ్డు నుంచి నది వరకు మట్టి రోడ్డు వేశారు. అక్కడి నుంచి ఇసుక తరలిస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా 12 టైర్ల బండ్లతో తరలిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గతంలో 20 ట్రిప్పుల ఇసుక కోసం ఒక ఆర్డర్ పేపర్ తెచ్చుకున్నారు. దాని సమయం ముగిసినా తహసీల్దార్ వద్ద గడువు పెంచుకున్నారు. మూడు నెలల నుంచి ఒకే ఆర్డర్ పేపర్ చూయిస్తూ ఇసుకను తరలిస్తున్నారు. దాసర్లపల్లి నుంచి హైదరాబాద్‌కు, నాగర్‌కర్నూల్ పరిధిలోని పలు గ్రామాలల్లో జరుగుతున్న నిర్మాణాలకు ఇసుకను సరఫరా చేస్తున్నారు. దాంతోపాటు మైనింగ్‌పైనా అక్రమార్కుల దృష్టి పడింది. గుట్టలు కరిగిపోతున్నాయి. తెలకపల్లి మండలం రామగిరి దేవాలయానికి సంబంధించిన గుట్ట నుంచి మట్టిని కొందరు పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఇలా భూత్పూరు, కోయిల్‌సాగర్, వట్టెం, పోతారెడ్డిపల్లి, తాడూరు మండల పరిధిలో ఉండే గుట్టలన్నీ మాయమౌవుతున్నాయి.

బోరు బావులు ఎండిపోయే అవకాశం

దుందుభీ నది నుంచి ఇసుక తోడెయ్యడంతో పరివాహక ప్రాంతంలో బోరుబావులు ఎండిపోయే అవకాశాలున్నాయి. 30 అడుగుల వరకు ఇసుక మేటలు ఉంటే.. 25 అడుగుల వరకు నీళ్లు ఉండేవి. ఇసుక తరలించడం వల్ల నీటి నిల్వ లేకుండా పోతున్నది. దుందుబీ నది ద్వారా మొత్తం 90 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ఇసుక ఉంటే బుర్రజెమ్మెడి, లొట్టపీసు చెట్లు మాత్రమే మొలిచేవి.. ఇసుకను తోడెయ్యడం వల్ల అడవిగడ్డితోపాటు కంప చెట్లు, వేప, తుమ్మ, ముళ్లపొదలతో నది నిండిపోతోంది. ఇసుక అక్రమ తరలింపుపై సంబంధిత అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. వెళ్లి హడావుడి చేసి వస్తున్నారు తప్పితే తగిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు పెద్దఎత్తున వస్తున్నాయి. ఇదంతా లారీ యజమానులు, అధికారుల కుమ్మక్కు వ్యవహారమన్న ఆరోపణలొస్తున్నాయి.

ఇసుక ఉంటేనే నీరు

మేము ఈ దుందుభీ నది నీటి ఆధారంగా జీవిస్తున్నాం. నదిలో నీళ్లు ఉంటేనే పంటలు పండుతాయి. అక్రమంగా ఇసుక తరలించడం వల్ల నీరు అడుగంటి భూములు బీడుబారే అవకాశం ఉంది. ఇసుక తవ్వకాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. పంట పొలాలకు సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

హరీష్, రైతు, రఘుపతిపేట, కల్వకుర్తి మండలం

ఇసుక అక్రమాలను అరికట్టాలి

దుందుభీ నది నుంచి ఇసుక తరలించడం వల్ల ఈ ప్రాంతం మరో సొమాలియగా మారుతున్నది. ముఖ్యంగా నీటి ఆధారంగా సాగు చేసే వరి, పల్లి, మొక్క, మిర్చి పంటలకు సాగునీటి సమస్య ఏర్పడుతుంది. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

రైతు సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు సి.బాల్‌రెడ్డి

అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు

మండల పరిధిలో ఇసుక అక్రమ తరలింపుపై మా దృష్టికి వచ్చింది. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అనుమతులు ఉంటేనే ఇసుక రీచ్‌లకు వెళ్లాలి. పర్మిషన్ తీసుకోని వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవు.

ఉప్పునుంతల ఎస్ఐ వెంకట్‌రెడ్డి



పంటలను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

అకాల వర్షాలతో తిప్పలు

- నేలకొరిగిన పైర్లు
- ఎకరానికి పంట నష్టం రూ.30 వేలివ్వాలి
- పంటలను పరిశీలించిన జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షంతో అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామ శివారులోని పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నేలకొరిగిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ... జిల్లాలో 3 రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాల కారణంగా వేలాది ఎకరాల పంట నేలకొరిగిందని తెలిపారు. రైతులు ఎన్నో కష్టాలు పడి పంటలు సాగు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర నష్టాలు వస్తున్నాయని అన్నారు. ఎకరానికి రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టారని, ఇప్పుడు అకాల వర్షాలతో పంటంతా దెబ్బతిందని అన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు లక్షల ఎకరాల్లో పత్తి, వరి, ఇతర పంటలు దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.30 వేల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ పర్యటనలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు మూడవత్ రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, కోట శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయన్న, హనుమనాయక్, చిన్నసాయన్న, నాగేశ్వర్ రావునాయక్, వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు ఉన్నారు.

సూపర్ స్పెషాలిటీ, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ వ్యయం తగ్గింపు

- రూ.6,714 నుంచి రూ.5,001 కోట్లకు తగ్గుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.1,715 కోట్లకు తగ్గించింది. ఈ మేరకు గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. రాష్ట్ర చరిత్రలో నిర్మాణ వ్యయాన్ని తగ్గించడం ఇదే తొలిసారి. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, టిమ్స్‌ల నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.3,779 కోట్లు వ్యయమవుతుందని గత బీఆర్ఎస్ సర్కార్ అంచనా వేసింది. ఆ మేరకు 2021లో జిఒలు జారీ చేసింది. అనంతరం రెండేండ్లలో నిర్మాణ వ్యయాన్ని రూ.6,714 కోట్లకు కేసీఆర్ సర్కార్ పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యయం పెంపుపై సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు. నిర్మాణ వ్యయం పెంపులో నిబంధనలు ఉల్లంఘించినట్లు ఎంక్వైరీ కమిటీ గుర్తించింది. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు అడ్డగోలు నిర్మాణ వ్యయాన్ని పెంచినట్టు సర్కారు నిర్ధారణకు వచ్చింది. దీంతో రూ.6,714 కోట్ల నుంచి రూ.5,001 కోట్లకు నిర్మాణ వ్యయాన్ని తగ్గించింది. క్యాబినెట్‌లో సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపింది.

వ్యాయమశాలల్లో స్టెరాయిడ్స్ అక్రమ నిల్వ

- డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడిలో పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యాయమశాలల్లో స్టెరాయిడ్స్‌ను అక్రమ నిల్వ ఉంచి అమ్మకాలు జరుపుతున్నారు. వీటితో పాటు గుండెకు ఉద్దీపన కలిగించే ఇంజెక్షన్లను కూడా విక్రయిస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు (డిసిఎ) చెందిన డ్రగ్ ఇన్ స్పెక్టర్లు శుక్రవారం హైదరాబాద్ నగరంలోని ప్రముఖ జిమ్స్‌లలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్, మెహిదీపట్నం, టోలిచౌకి, మలక్‌పేట్, పంజగుట్ట, నార్సింగి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొత్తపేట్, కూకట్ పల్లి, సూరారం ప్రాంతాల్లో 20 వ్యాయమశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనబాలిక్ -అండ్రోజెనిక్ స్టెరాయిడ్స్‌తో పాటు గుండెకు ఉద్దీపన కలిగించే మెఫెటెర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ ను చట్ట విరుద్ధంగా నిల్వ ఉంచి జిమ్‌కు వచ్చే వారికి ఉపయోగిస్తున్నట్టు గుర్తించారు. స్థానిక పోలీసుల సహకారంతో చేపట్టిన దాడిలో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కండరాల పెరుగుదల కోసం తరచూ ఇలాంటి డ్రగ్స్ ఉపయోగించే బాడీ బిల్డర్ల ఆరోగ్యంపై అవి దుష్ప్రభావం చూపిస్తాయని అధికారులు హెచ్చరించారు. గుండె నాళాలు, కాలేయం, తరచుగా కోపం రావడం, హార్మోన్స్‌లో అసమతుల్యతతో పాటు దీర్ఘకాలంలో సంతానలేమి సమస్యలకు, మూత్రపిండాల వైఫల్యం, మానసిక ఇబ్బందులు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని వారు హెచ్చరించారు. ఆయా వ్యాయమశాలల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు డీసీఏ అధికారులు తెలిపారు.

గురుకులంలో ఎలుకల కలకలం

- ఎనిమిది మంది విద్యార్థులను కరిసిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామ శివారులోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులను ఎలుకలు కరవడం కలకలం రేపింది. గురువారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఎనిమిది మంది విద్యార్థులను ఎలుకలు కరిచాయి. విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి హాస్టల్ భవనంలో నిద్రిస్తున్న సమయంలో విద్యార్థినులు నికిత, జ్యోతి, ఉష, గీతాంజలి, సంధ్య, అశ్విత, మరో ఇద్దరిని ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని వెంటనే ఉపాధ్యాయులకు తెలపడంతో.. వారిని నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

కాగా, హాస్టల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల భద్రత విషయంలో ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ ఘటనపై ప్రిన్సిపల్ లలితాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులకు కాళ్లపై నుంచి ఎలుకలు పోయి.. కరిచిన విషయం వాస్తవమేనని ప్రిన్సిపాల్ లలితాదేవి అన్నారు. వెంటనే స్పందించి వారిని హాస్పటల్‌కు తరలించి చికిత్స చేయించినట్టు చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేదని ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.

ఫెడరల్ బ్యాంక్‌లో బ్లాక్‌స్టోన్‌కు 10 శాతం వాటా



న్యూఢిల్లీ : ప్రయివేటు రంగ దేశీయ విత్త సంస్థ ఫెడరల్ బ్యాంకులో న్యూయార్క్‌కు చెందిన బ్లాక్‌స్టోన్ కంపెనీ 9.99 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకోసం బ్లాక్‌స్టోన్ అనుబంధ ఆసియా2 టోప్కో13 ద్వారా రూ.6,196.51 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. కోచ్చి కేంద్రంగా పని చేస్తోన్న ఫెడరల్ బ్యాంక్ ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా 272.97 మిలియన్ వారెంట్లను బ్లాక్‌స్టోన్‌కు జారీ చేయనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఈ షేర్లను రూ.227 వద్ద విక్రయించనుంది. ఈ వారెంట్ల కింద ఫెడరల్ బ్యాంకులో బ్లాక్‌స్టోన్ వాటాను పొందనుంది. ఈ పెట్టుబడికి నియంత్రణ సంస్థలు ఆర్‌బిఐ, సెబీ సహా వాటాదారుల నుంచి ఆమోదం లభించాల్సి ఉంటుంది. బ్లాక్‌స్టోన్ పెట్టుబడికి సంబంధించి నవంబర్ 19న ఫెడరల్ బ్యాంక్ అసాధారణ సమావేశం (ఇజిఎం) నిర్వహించనుంది. ఈ ఒప్పందంలో భాగంగా బ్యాంక్ బోర్డులో ఒక నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను బ్లాక్‌స్టోన్ నియమించుకోవడానికి వీలుంటుంది.

వారం రోజుల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల జనరల్ లిస్ట్

- టియుఎంహెచ్ఇయు నేతలతో డాక్టర్ చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2,322 నర్సింగ్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి సంబంధించి వారం రోజుల్లో జనరల్ లిస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని ప్రజాభవన్‌లో సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన సిఎం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. నర్సింగ్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని టీయుఎంహెచ్ఇయూ నేతలు కోరారు. నర్సింగ్ ఆఫీసర్లకు సంబంధించి ప్రొవిజనల్ లిస్ట్ మాత్రమే విడుదల చేశారనీ, జనరల్ మెరిట్ లిస్ట్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన చిన్నారెడ్డి మెడికల్ నియామక మండలి కార్యదర్శితో మాట్లాడి వారం రోజుల్లో జనరల్ మెరిట్ లిస్ట్ విడుదలకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ఫైనల్ సెలక్షన్ లిస్ట్ విడుదల చేయాలని నాయకులు కోరారు. దీనిపై కూడా బోర్డు కార్యదర్శితో మాట్లాడిన చిన్నారెడ్డి, ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే లిస్ట్ ప్రకటిస్తామని తెలిపారు. ఏఎన్ఎం, ఫార్మసిస్టుల మెరిట్ లిస్టుల విషయంలో ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని నియామకాలను భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాల్, నర్సింగ్ ఆఫీసర్ల తరఫున సుష్మా, రమేష్ రెడ్డి, చందు, మధు, ల్యాబ్ టెక్నీషియన్ల తరఫున ఆదిత్య, సంగమేశ్వర్ , కోటేష్, సంజయ్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కవిత (ఏఎన్ఎం లీడర్) తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5 నుంచి ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభ

- మార్పు కోసం నిస్వార్థంగా అంకితమైన పిఎన్ఎం
- ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ
- పిఎన్ఎం బ్రోచర్ విడుదల



బ్రోచర్ విడుదల చేస్తున్న కెవి రమణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజానాట్యమండలి రాష్ట్ర మూడో మహాసభ జనవరి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్ రవీంద్రభారతి ప్రధాన వేదికపై నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం మాసబ్‌ట్యాంక్ వద్దనున్న నఫీజ్ రెసిడెన్స్‌లోని ఆయన నివాస కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో మార్పు కోసం నిస్వార్థంగా అంకితమైన ప్రజానాట్యమండలి ప్రజల కోసం, వారి చైతన్యం కోసం పనిచేస్తోందన్నారు. పిఎన్ఎం కళాకారులు సామాన్య స్థాయిలో ఉన్నా అసామాన్యంగా ఆదర్శవంత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. కళాకారుడు పాడే పాట అందరికీ ఆనందం ఇస్తుంది.. అలాంటి కళాకారుల స్థితిగతులను పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారుల శ్రేయస్సుకు సహకరించేవారు తక్కువ అన్నారు. పబ్లిక్ ప్రయివేటు భాగస్వామ్యం ఉంటే సామాజిక మార్పు కోసం ప్రజా కళారూపాల మనుగడ కొనసాగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ జానపద కళారూపాల పరిరక్షణకు పాటుపడుతూనే ప్రజలకి చేరువయ్యేందుకు పిఎన్ఎం ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ మాట్లాడుతూ.. గరికపాటి రాజారావు తదితరుల ఆధ్వర్యంలో ఆవిర్భవించిన ప్రజానాట్యమండలి.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత 2014లో తొలి రాష్ట్ర మహాసభ రమణాచారి అధ్యక్షతన విజయవంతంగా జరుపుకున్నామని గుర్తు చేశారు. మూడో మహాసభకు చైర్మెన్‌గా ఆయన అందిస్తున్న సహకారం, సలహాలకు ధన్యవాదాలు తెలిపారు. స్వాగతం పలికిన సమన్వయకర్త ఎన్.మారన్న మాట్లాడుతూ.. నటుడు మాదాల రవి రాష్ట్ర మహాసభ అధ్యక్షులుగా, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ, నవతెలంగాణ సంపాదకులు ఆర్ రమేష్ తదితరులు చీఫ్ ప్యాట్రన్స్‌గా, మరో 20 మంది ప్రముఖులు ప్యాట్రన్స్‌గా ఉన్నారని తెలిపారు. మహాసభలో 600 ప్రతినిధులు, మరో 600 మంది కళాకారులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు వి.ఆనంద్ సినారె గజల్‌తోపాటు ప్రజానాట్యమండలి గీతాన్ని ఆలపించారు. కళ్యాణ్, నరేష్, గోపాల్, భాస్కర, రాము, క్రాంతి, శంకర్, సిర్ప లింగం, గడ్డం గణేష, ముకుంద ఐలయ్య, విజయ పాల్గొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ లాభాల్లో 14 శాతం వృద్ధి



హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 14.5 శాతం వృద్ధితో రూ.1,437 కోట్ల నికర లాభాలు సాధించినట్లు వెల్లడించింది. బ్రాండెడ్ మార్కెట్‌లో మెరుగైన అమ్మకాలు అధిక లాభాలకు దోహదం చేశాయని పేర్కొంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ కంపెనీ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.1,255 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.8,016 కోట్ల రెవెన్యూ నమోదు చేయగా.. గడిచిన క్యూ2లో రూ.8,805 కోట్ల రెవెన్యూ సాధించింది. నార్త్ అమెరికా అమ్మకాలు 13 శాతం తగ్గి రూ.3,241 కోట్లుగా, యూరప్ రెవెన్యూ దాదాపు రెట్టింపై రూ.1,376 కోట్లుగా చోటు చేసుకుంది. భారత రెవెన్యూ 13 శాతం పెరిగి రూ.1,578 కోట్లకు చేరింది.

శ్రీధ హాస్పిటల్ సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని శ్రీధ ప్రయివేటు ఆస్పత్రిని డిఎంహెచ్ఒ నాగ నిర్మల శుక్రవారం సీజ్ చేశారు. సదరు ఆస్పత్రి బినామీ పేరుతో రిజిస్ట్రేషన్ అయి.. మరో వ్యక్తితో నడిపిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, గత కొంతకాలంగా అర్హత లేని డాక్టర్లతో వైద్యం చేస్తుండగా పలువురు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. గూగుల్‌లో చూసుకుంటూ వైద్యం చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అలాగే పలువురు ఇప్పటికే ఈ ఆస్పత్రిపై ఫిర్యాదు చేశారు. దాంతో డీఎంఅండ్‌హెచ్ఒ నాగ నిర్మల శుక్రవారం ఆకస్మికంగా ఈ ఆస్పత్రిలో తనిఖీ చేసి సీజ్ చేశారు. ఆమె వెంట జిల్లా అధికారులు, పుల్కల్ ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

ఐపిఎం విస్తరణ

హైదరాబాద్ : ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ ఐపిఎం ఇండియా తన కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు తెలిపింది. డిజిటల్ కోచింగ్ ప్లాట్‌ఫామ్ ఉయ్ ఎస్ ద్వారా గ్రో టాలెంట్ గ్రో బిజినెస్ (జిటిజిబి)తో వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నామని ఐపిఎం ఇండియా పీపుల్ అండ్ కల్చర్ డైరెక్టర్ కింగ్షుక్ దాస్ తెలిపారు. వేగంగా మారుతున్న వ్యాపార వాతావరణంలో వ్యక్తులు సంబంధితంగా నైపుణ్యాలు పెంచుకోవడానికి దోహదం చేస్తుందన్నారు.

చంటిబిడ్డతో బావిలో దూకి తల్లి ఆత్మహత్య


- జన్నారం మండలంలో విషాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో అమానుష ఘటన జరిగింది. తొమ్మిది నెలల పాపతోపాటు తల్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. రేండ్లగూడ గ్రామానికి చెందిన చెటుపల్లి శ్రవణ్‌కు జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన స్పందన (24)తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని స్పందన మానసికంగా కుంగిపోయేది.

పలుమార్లు తాను చనిపోతానని సన్నిహితులతో చెప్పేది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో చిన్న కుమార్తె వేదశ్రీకి అన్నం తినిపించిన అనంతరం పాపతోపాటుగా వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వారు కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. అనుమానంతో బావిలో చూడగా విగతజీవులుగా కన్పించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ అనూష సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను బయటకు తీయించారు. మృతురాలి తల్లి భూదారపు ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.

ఆర్ఎన్ఐటి ఎఐ సొల్యూషన్స్ లిస్టింగ్



హైదరాబాద్ : ఆర్ఎన్ఐటి ఎఐ సొల్యూషన్స్ లిమిటెడ్ భారత స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ పొందిన తొలి ఎఐ ఆధారిత గవర్నెన్స్ సంస్థగా నిలువనుందని ఆ సంస్థ పేర్కొంది. శుక్రవారం బిఎస్ఇ వద్ద ఆర్ఎన్ఐటి ఎఐ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎండి, సిఇఒ రాజా శ్రీనివాస్ నందిగం స్టాక్ మార్కెట్ ప్రారంభ ఘంటాను మోగించి అధికారికంగా ట్రేడింగ్ ప్రారంభాన్ని ప్రకటించారు. దీంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత గవర్నెన్స్, డిసిషన్ ఇంటెలిజెన్స్‌లో కొత్త యుగానికి శ్రీకారం చుట్టినట్లయ్యిందని రాజా శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న తమ సంస్థకు ఇది ఒక ఆర్థిక ఘట్టం మాత్రమే కాదని.. తమ మిషన్‌కు సంబంధించిన మైలురాయి కూడా అని అన్నారు. దీంతో ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్, ఫుడ్ రంగాల్లో విస్తరించడానికి మరింత శక్తిని పొందుతున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు.

వచ్చే నెల నుంచి 'భారత్ ట్యాక్సీ' సేవలు

న్యూఢిల్లీ : భారత ట్యాక్సీ అగ్రిగేటర్ రంగంలో ఓలా, ఉబర్‌కు పోటీగా కేంద్రం కొత్తగా భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తోంది. ప్రయివేట సంస్థలకు ధీటుగా ఈ సహకార ట్యాక్సీని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, నేషనల్ ఇ-గవర్నెన్స్ డివిజన్ అభివృద్ధి చేసింది. సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్ కింద ఈ ట్యాక్సీ సేవలు అందనున్నాయి. ఈ సంస్థను 2025 జూన్‌లో ఏర్పాటు చేయగా.. పైలట్ ప్రాతిపదికన నవంబర్ నుంచి ఢిల్లీలో ఈ సేవలు ప్రారంభంకానున్నాయి. తొలుత 650 మంది సొంత వాహనాలు కలిగిన డ్రైవర్లు దేశ రాజధాని నగరంలో ఈ సేవలు అందించనున్నారు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమయితే.. డిసెంబర్‌లోనే దేశ వ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి. సహకార సంఘాల మాదిరిగా ఇది పని చేస్తుంది. ఇందులో నమోదు చేసుకున్న ట్యాక్సీ డ్రైవర్లు ఎలాంటి కమీషన్ చెల్లించాల్సిన అవసరం లేదు.. మెంబర్‌షిప్ కింద స్వల్ప మొత్తం ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.

గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య

- హనుమకొండ జిల్లా వంగర గురుకులంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మనస్తాపంతో విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని డాక్టర్ పీవీ రంగారావు మెమోరియల్ తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగింది. వంగర బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న వనం శ్రీవర్షిత (14) ఇటీవల దీపావళి సెలవులకు ఇంటికి వెళ్లింది. విద్యార్థిని తండ్రి తిరుపతి గురువారం మధ్యాహ్నం తిరిగి పాఠశాలకు తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం సిబ్బంది ఫోన్‌తో తండ్రికి కాల్ చేసి.. స్కూల్‌లో భయంగా ఉందని, త్వరగా రావాలని ఏడుస్తూ మాట్లాడింది. దాంతో ఆందోళన చెందిన విద్యార్థి తండ్రి తిరుపతి.. తాను వచ్చేంతవరకు తమ కుమార్తెను జాగ్రత్తగా చూసుకోవాలని, ఆమెకు తోడుగా ఒకరిని ఉంచాలని ప్రిన్సిపాల్‌ని ఫోన్‌లో కోరాడు. పాఠశాల సిబ్బంది మనోవేదనతో ఉన్న విద్యార్థి శ్రీవర్షితను పట్టించుకోకపోవడంతో వసతి గృహంలోకి వెళ్లి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థిని తండ్రి తిరుపతి పాఠశాల వద్దకు చేరుకొని గేటు వద్ద చాలాసేపు వేచి చూసినా సిబ్బంది తలుపులు తీయలేదు. విద్యార్థిని మృతిచెందిందని నిర్ధారణ చేసుకున్న సిబ్బంది గేటు తీశారు. తండ్రి లోపలకు వచ్చి చూడగానే విగతజీవిగా కూతురు కనిపించడంతో బోరున విలపించాడు. తన కూతురి వెంట ఉండి కాపాడాల్సిన మీరు దారుణంగా చంపేశారంటూ బోరునవిలపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఘటన విషయం తెలుసుకున్న వంగర ఎస్ఐ దివ్య, ముల్కనూర్ ఎస్ఐ రాజు, ఎల్కతుర్తి ఎస్ఐ ప్రవీణ్, సిఐ రమేష్ పాఠశాల వద్దకు చేరుకున్నారు. అప్పటికే గ్రామస్తులకు విషయం తెలియడంతో పాఠశాల వద్ద పెద్దఎత్తున గుమ్మిగూడారు. పరిస్థితి అదుపుతప్పే అవకాశాలు కనిపిస్తుండటంతో పోలీసులు విద్యార్థిని మృతదేహాన్ని హుటాహుటిన పోస్టుమార్టం నిమిత్తం హుజురాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో కాజీపేట ఏసిపి పింగిలి జయపాల్ రెడ్డి పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. పాఠశాలలో చదువుతున్న ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనతో వారి కుమార్తెలను వెంట తీసుకొని వెళ్లారు. ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయుల వేధించడం వల్లే తన కుమార్తె చనిపోయిందని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, పాఠశాల వద్దకు చేరుకున్న సీపీఐ నాయకులు గేట్ ఎదుట బైటాయించి ఆందోళన వ్యక్తం చేశారు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం : వాసంతి, జిల్లా విద్యాధికారి

వంగర బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థిని శ్రీవర్షిత మృతిపై విచారణ చేపడతామని హనుమకొండ జిల్లా విద్యాధికారి వాసంతి అన్నారు. విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఆమె పాఠశాలకు చేరుకుని మృతిపై ఆరా తీశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినీలు, సిబ్బంది నిర్లక్ష్యం అని తేలితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.